పొంచి ఉన్న 'మొంతా' ముప్పు

- ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- 29 వరకు వర్షాలు
- అడయార్ తీరాన్ని పరిశీలించిన సీఎం



నదీ తీరాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి ఎం.సుబ్రమణ్యం తదితరులు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. ఈ అల్పపీడనం మరింత బలపడి ఆదివారం తుపానుగా మారే అవకాశముందని, ఈ ప్రభావంతో రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో శనివారం నుంచి భారీవర్షాలు కురుస్తాయని తెలియజేసింది. కాగా, ఈ తుపానుకు థాయ్‌లాండ్ 'మొంతా' అనే పేరు సూచించింది. బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడనం, పశ్చిమ-వాయువ్య దిశగా పయనించి వాయుగుండంగా బలపడిన నేపథ్యంలో, గురువారం బలహీనపడి అల్పపీడనంగా మారి, రాష్ట్రంలోని అంతర జిల్లాలు, వాటి పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. ఈ కారణంగా రాష్ట్రంలో 8.2 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. గురువారం వరకు 108 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 199.2 మి.మీ వర్షపాతం నమోదైంది. చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. అలాగే, అండమాన్ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం ఆంధ్ర తీరప్రాంతం వైపు కదులుతోంది. ఈ క్రమంలో, ఆగ్నేయ బంగాళాఖాతం దక్షిణ అండమాన్ సముద్రతీరంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం వాయుగుండంగా మారి ఆదివారం తుపానుగా మారే అవకాశముందని, ఈ తుఫాను ఆంధ్ర రాష్ట్రంలో తీరం దాటనుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం కారణంగా కోవై, నీలగిరి, ఈరోడ్, తిరుపత్తూర్, వేలూరు, రాణిపేట జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముండడంతో 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించారు. అలాగే, ఇతర ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నెల 26, 27 తేదీల్లో చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. ఈ ప్రభావం 29వ తేది వరకు కొనసాగుతుందని అంచనా.

అడయార్ నదీ తీరాన్ని పరిశీలించిన సీఎం...

స్థానిక అడయార్ నది ముఖద్వారాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం పరిశీలించారు. చెన్నై, చుట్టుపక్కల జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నగరానికి తాగునీరందించే జలాశయాల్లో నీటి రాక పెరిగింది. రాబోయే రోజుల్లో వర్షాలు కొనసాగుతాయని హెచ్చరికల నేపథ్యంలో జలాశయాల్లో చేరే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు కొశస్థలి, అడయార్ నదుల మీదుగా ప్రవహించి సముద్రంలో చేరుతోంది. ఈ నేపథ్యంలో, శ్రీనివాసపురం సమీపంలో అడయార్ నది సముద్రంలో కలిసే ముఖద్వారాన్ని, దాని తీర ప్రాంతాలను సీఎం పరిశీలించారు. ముఖద్వారం విస్తరణ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సీఎం వెంట మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఎళిలన్, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్‌మొళి సహా ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

నేటినుంచి కేంద్ర బృందం పర్యటన

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా నష్టపోయిన పంట వివరాల సేకరణకు కేంద్ర బృందం శనివారం నుంచి పలు జిల్లాల్లో పర్యటించనుంది. శనివారం చెంగల్పట్టు, తంజావూరు, మైలాడుదురై, పుదుకోట జిల్లాలు, ఆదివారం తిరువళ్లూర్, కాంచీపురం, తిరువారూరు, నాగపట్టణం, మదురై, తేని జిల్లాల్లో పర్యటించనుంది. అలాగే, 27న కడలూరు జిల్లాలో కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలోని రెండు బృందాలు, అసిస్టెంట్ డైరెక్టర్ నేతృత్వంలో మరో బృందం వర్షాలు నష్టం జరిగిన జిల్లాల్లో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, వర్షాల కారణంగా వరి తడిచిపోవడంతో, 17కు బదులు 22 శాతం తేమ ఉన్న ధాన్యం కూడా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.

పూండి జలాశయం నీటి విడుదల పెంపు...

నగరానికి తాగునీరందించే పూండి జలాశయానికి నీటి రాక పెరిగింది. 35 అడుగుల సామర్థ్యం కలిగిన జలాశయంలో నీటిమట్టం 32.85 అడుగులకు చేరింది. శుక్రవారం ఉదయం జలాశయానికి 7,259 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా డ్యాం భద్రత దృష్ట్యా 6,500 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తుండడంతో, కొశస్థలి నదిలో వరద ఉధృతి పెరిగింది, నది తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది.

ఐదు రోజుల అనంతరం ఊటీ కొండ రైలు సేవలు ప్రారంభం

నీలగిరి జిల్లా కున్నూర్‌లో కురిసిన భారీవర్షాల కారణంగా, ఈ నెల 18వ తేది రాత్రి మేట్టుపాళయం-ఊటీ కొండ రైలు మార్గంలో కున్నూర్ నుంచి రన్నిమేడు వరకు 16 ప్రాంతంలో మట్టిచరియలు, బండరాళ్లు పడిన విషయం తెలిసిందే. ఈ కారణంగా మేట్టుపాళయం-ఊటీ మధ్య రైలు సేవలు నిలిపివేశారు. రైలు మార్గంపై పడిన బండరాళ్లు, మట్టి చరియలు, చెట్లను సిబ్బంది తొలగించడంతో, ఐదు రోజుల అనంతరం శుక్రవారం ఉదయం మేట్టుపాళయం నుంచి ఊటీకి 184 మంది పర్యాటకులతో కొండ రైలు బయల్దేరింది.

రెండు రోజుల్లో 4.40 లక్షల మందికి ఆహారం పంపిణీ...

రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల్లో 4.40 లక్షల మందికి ఆహారం అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం అందించేలా 106 వంట శాలలు ఏర్పాటుచేశారు. 22,23 తేదీల్లో 1,48,450 మందికి ఉదయం అల్పాహారం, 2,23,950 మందికి మధ్యాహ్న భోజనం, 28,000 మందికి రాత్రి భోజనం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

వచ్చే వారం నుంచి ఓటరు జాబితా సవరణ

- హైకోర్టుకు తెలిపిన ఎన్నికల కమిషన్

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే వారం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రారంభించనున్నట్లు మద్రాస్ హైకోర్టుకు ఎన్నికల కమిషన్ తెలియజేసింది. టి.నగర్ నియోజకవర్గంలో అన్నాడీఎంకేకు చెందిన సుమారు 13వేల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, తొలగించిన వారికి బదులు కొత్త ఓటర్లను చేర్చారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. 1998వ సంవత్సరం టి.నగర్ నియోజకవర్గంలో 2,08,349 మంది ఓటర్లుండేవారని, 30యేళ్ల అనంతరం 2021లో ఈ నియోజకవర్గంలో 36,656 మంది ఓటర్లు మాత్రమే పెరిగారని, ఇది జనాభా సంఖ్య, ఓటరు జాబితాలో ఓటు హక్కు కలిగిన వారి సంఖ్యకు పొంతన లేకుండా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గంలో అన్నాడీఎంకేకు మద్దతుగా ఉన్న 13వేల మంది పేర్లను తొలగించి, వారి స్థానంలో కొత్త ఓటర్లను చేర్చారని, అలాగే మృతుల పేర్లను కూడా తొలగించలేదని ఈసీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ఈసీ హామీ ఇవ్వాలని, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే టి.నగర్ నియోజకవర్గ ఓటరు జాబితా పునఃపరిశీలించి ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాల్సిందిగా ఈసీని ఆదేశించాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ కేసు శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ శ్రీవత్సవ, జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ జాబితా పనులను వచ్చే వారం ప్రారంభిస్తామని, ఆ సమయంలో, పిటిషనర్ తెలియజేసిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరింపజేసే చర్యలుంటాయని ఈసీ తరపున హాజరైన న్యాయవాది తెలిపారు. ఈసీ నోటిఫికేషన్ తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వాహణపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నికల అధికారులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే దరఖాస్తులను పూర్తిచేసి నెల లోపు సమర్పించాల్సిందిగా ఓటర్లను కోరనున్నట్లు తెలిపారు. ఇరు తరుపు వాదనల అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చేవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం, బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పనులకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నకలును దాఖలు చేయాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది.



మద్రాస్ హైకోర్టు



మేట్టూరు నుంచి

అదనపు జలాలు విడుదల

- 11 జిల్లాలకు వరద హెచ్చరిక

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కావేరి నదిలో నీటి పరిణామం 57వేల ఘనపుటడుగులకు పెరిగిన నేపథ్యంలో మేట్టూరు డ్యాం నుంచి 55వేల ఘనపుటడుగుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కర్నాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆ రాష్ట్ర డ్యాంల్లో నీరు పెరగడంతో, అదనపు జలాలను కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. అదే సమయంలో, కావేరి పరీవాహక ప్రాంతా ల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. హొగేనేకల్ వద్ద వస్తున్న కావేరి జలాలు గురువారం ఉదయం 32వేల ఘనపుటడుగులుగా ఉండగా, రాత్రి 7 గంటల ప్రాంతంలో 50వేల ఘనపుటడుగులకు పెరిగింది. హొగేనేకల్‌లోని జలపాతాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, నాలుగు రోజుల నుంచి దోనెల సవారీ నిలిపివేశారు. అంతేగాక పర్యాటకులను అనుమతించడం లేదు. అలాగే, మేట్టూరు జలాశయానికి గురువారం ఉదయం 35,500 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, సాయంత్రం 6 గంటలకు 45వేల ఘనపుటడుగులు, శుక్రవారం ఉదయం 55వేలఘనపుటడుగులకు చేరింది. మేట్టూరు జలాశయంలో ఐదవ రోజుగా పూర్తి సామర్థ్యం 120 అడుగులు కొనసాగుతుండడంతో, జలాశయానికి వస్తున్న నీటిని అదే పరిమాణంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయం నుంచి నీటి విడుదల పెంచడంతో, సేలం, ఈరోడ్, నామక్కల్, కరూర్, అరియలూరు, తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, నాగపట్టణం తదితర 11 జిల్లాల తీరప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీచేశారు.

మరుదు సోదరులకు నివాళి



స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల వర్థంతి సందర్భంగా శుక్రవారం గిండిలోని గాంధీ మండపంలో ఉన్న వారి విగ్రహాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నివాళులర్పిస్తున్న మంత్రులు తంగం తెన్నరసు, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు

తిరువలంగాడులో చెరకు క్రషింగ్ ప్రారంభం
6
మద్యం అమ్మకాలను పెంచే ఉద్దేశం లేదు
- మంత్రి ఎస్.ముత్తుస్వామి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూరోపేట సమీపంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు సేలం శీలనాయకన్‌పట్టికి చెందిన శ్రీధర్ కుమారుడు సంతోష్ (28), కడలూరులో నివసిస్తున్న తమ బంధువు భాగ్యలక్ష్మి (55)ని, సూర్య (24)అనే బంధువును తన కారులో ఎక్కించుకుని సొంతూరు బయలుదేరాడు. సంతోష్ నడిపిన కారు కళ్లకురిచ్చి జిల్లా ఎలవనశూరకోట ప్రాంతంలోని సేలం-చెన్నై జాతీయ రహదారిలో ఉదయం 8 గంటలకు వెళుతుండగా తారులోడుతో వెళుతున్న ట్యాంకర్ లారీని కారు ఢీకొనడంతో అందులో ఉన్న ముగ్గురు సంఘటన స్థలంలోని మృతిచెందారు. అందిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ప్రమాదానికి కారణమైన తంజావూరు జిల్లా మరనేరి ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ దురైరాజ్ పరారవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



కారు నుంచి మృతదేహాలను బయటికి తీస్తున్న దృశ్యం

'సేకరణ'లో జాప్యం.. మొలకెత్తుతున్న ధాన్యం

- ఆందోళనలో రైతాంగం



తడిసిన ధాన్యంతో రైతు దిగాలు

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డెల్టా జిల్లాలో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ధాన్యం మొలకెత్తుతోంది. వీటిని చూసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్ళలో ఎలాంటి ఆలస్యం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో తంజావూరు జిల్లాకు ధాన్యభాండాగారంగా పేరుంది. ప్రతియేటా ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి సాగుచేస్తుంటారు. ఈ యేడాది జూన్ 12వ తేదీన మెట్టూరు డ్యాం నుంచి సాగునీటిని విడుదల చేశారు. దీంతో తంజావూరు జిల్లాలో 79 వేలు, తిరువారూర్‌లో 77,593, నాగపట్టణంలో 30,100 వేల, మైలాడుదురైలో 39,700 హెక్టార్లలో కురువై సాగు చేయగా, ఈ డెల్టా జిల్లాల్లో పంట చేతికొచ్చింది. ఈ ధాన్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇందుకోసం తంజావూరు జిల్లాలోనే 299 ధాన్య సేకరణ కేంద్రాలను ప్రారంభించారు. తిరువారూరులో 347, నాగపట్టణంలో 124, మైలాడుదురైలో 144 చొప్పున ఈ సేకరణ కేంద్రాలున్నాయి. అయితే, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో డెల్టా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే ధాన్య సేకరణ ఆలస్యం కావడంతో అనేక ప్రాంతాల్లో వరి ధాన్యం వర్షంలో తడిసి, ధాన్యం మొలకెత్తుతోంది. వీటిని చూసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం శుక్రవారం నాగపట్నం జిల్లాలో వర్షాల కారణంగా దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు.



నాగపట్నం జిల్లా తిరువాయుమూర్‌లో తడిసిన వరిపైరు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

తడిగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : సీపీఐ

22 శాతం తేమగా ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ధాన్యం సేకరణ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశాయన్నారు. అయితే, ధాన్యంలో 22 శాతం తేమ ఉన్నప్పటికీ సేకరించాలని ఆయన కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డీఎంకే నాయకులకు స్టాలిన్ శిక్షణ

- 28న మహాబలిపురంలో ప్రత్యేక శిబిరం

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన డీఎంకే నాయకుల శిక్షణా శిబిరం జరుగనుంది. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో ఈ నెల 28వ తేదీ జరిగే శిబిరం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా సీఎం స్టాలిన్ వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన నిజయోకవర్గాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'ఉడన్ పిరప్పే' పేరుతో నిర్వహించే ఈ సమీక్షా సమావేశాల్లో భాగంగా, ఇప్పటికే 70 స్థానాల నిర్వాహకులతో సీఎం స్టాలిన్ ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమం తర్వాత బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ)తో సమావేశం నిర్వహించి వారికి సూచలు చేశారు. అలాగే, ఎన్నికల పర్యవేక్షణ కోసం జోన్ స్థాయిలో ప్రతినిధులను నియమించారు. ఆ ప్రకారంగా చెన్నైకు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎ.రాజా, సౌత్ జోన్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కనిమొళిని నియమించారు. అలాగే, ప్రతి జోన్‌కు ఇన్‌చార్జులుగా మంత్రులను నియమించారు. వీరంతా తమతమ పరిధుల్లో బీఎల్ఏలతో సమావేశాలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఇపుడు 'ఎన్ వాక్కు చావడి - వెట్రి వాక్కు చావడి (నా పోలింగ్ కేంద్రం - గెలుపు పోలింగ్ బూత్) పేరుతో స్టాలిన్ అధ్యక్షతన ఈ నెల 28న మహాబలిపురం వేదికగా నిర్వహించనున్నారు. ఈ సమావేశం ఏర్పాట్లను కాంచీపురం ఉత్తర జిల్లా పార్టీ కార్యదర్శి, మంత్రి టీఎం అన్బరసన్ దగ్గరుండి చేయిస్తున్నారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. పుళల్ పరిధిలోని జవహర్‌లాల్ నగర్, కామరాజ్ నగర్, పాడియనల్లూర్, నేతాజ్ నగర్, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపింది.

4న టెన్త్, ప్లస్ టూ పరీక్షల టైం టేబుల్ విడుదల

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ నవంబరు 4న విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 2026 మార్చి ఏప్రిల్ నెలల్లో పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాలల ప్రారంభంలో విద్యాశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ నవంబరు 4వ తేది విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. కాగా, ఈ ఏడాది నుంచి ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలను రద్దు చేసిన విషయం తెలిసిందే.

30న రామనాథపురానికి సీఎం

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముత్తురామలింగ దేవర్ గురుపూజోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్, ఈ నెల 30వ తేది రామనాథపురం జిల్లా పసుమ్‌పొన్ వెళ్లనున్నారు. సీఎం స్టాలిన్ శుక్రవారం తెన్‌కాశి జిల్లాలో పర్యటించాల్సి ఉండగా, భారీవర్షాల కారణంగా సీఎం పర్యటన రద్దయింది. ఈ క్రమంలో, 28వ తేది సీఎం తెన్‌కాశి జిల్లాకు వెళ్లనున్నారు. 30వ తేది దేవర్ గురుపూజ సందర్భంగా మదురై గోరిపాళయంలోని దేవర్ విగ్రహానికి నివాళులర్పించనున్నారు. అనంతరం మదురై నుంచి కారులో రామనాథపురం జిల్లా పసుమ్‌పొన్ గ్రామానికి వెళ్లనున్నారు. అక్కడ దేవర్ స్మారక మందిరంలో జరిగే పూజల్లో సీఎం పాల్గొంటారు. అక్కడి నుంచి మదురై వెళ్లి, రాత్రికి విమానంలో నగరానికి చేరుకోనున్నారు.

27 నుంచి వార్డు సభలు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్, మున్సిపాలిటీ తదితర సంస్థల్లోని వార్డు సభలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 27 నుంచి మూడు రోజులు ఏదో ఒక రోజు సభలు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు నగరపాలక, తాగునీటి సరఫరా శాఖ ప్రధాన కార్యదర్శి టి.కార్తికేయన్ జారీచేసిన ఉత్తర్వుల్లో... కార్పొరేషన్, మున్సిపాలిటీ, పట్టణ పంచాయతీలోని ప్రతి వార్డులో ఆయా ప్రాంతాల కౌన్సిలర్లు నేతృత్వంలో వార్డు సభలు నిర్వహించాలన్నారు. ప్రజలు తెలియజేసే ఫిర్యాదులపై సభలో చర్చించాలన్నారు.

'ఆర్టీఐ' సీట్లకు 81 వేల దరఖాస్తులు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాల విద్యా హక్కు చట్టం కింద 81 వేల దరఖాస్తులందాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 7,117 పాఠశాలలు ఆర్టీఏ సీట్లు కేటాయింపునకు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. ఆర్టీఏ చట్టం కింద కేటాయించిన 25 శాతం సీట్లకు 81,927 మంది విద్యార్థులు ఎల్‌కేజీ, 89 మంది విద్యార్థులు 1వ తరగతికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 30,31 తేదీల్లో దరఖాస్తులు పరిశీలించి సీట్ల కేటాయించనున్నామన్నారు. అలాగే, కేటాయించిన సీట్ల కంటే అదనంగా దరఖాస్తులు అందిన పాఠశాలల్లో, డ్రా పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

వెటర్నరీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 76 వెటర్నరీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిలో వివిధ జంతు సంక్షేమ కార్యకలాపాలను సమర్థవంతగా అమలుచేసేలా తమిళనాడు జంతు సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో 38 జిల్లాల జంతు సంక్షేమ అధికారుల కార్యాలయాలున్నాయని తెలిపింది. జల్లికట్టు వంటి కార్యక్రమాల సమయంలో జంతువులకు హాని కలుగకుండా చూసుకోవడం, జంతువులపై హింసకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు, జిల్లా స్థాయిలో ప్రత్యేక జంతు సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేయడం జిల్లా జంతు సంక్షేమ కార్యాలయం చేపడుతుందని తెలిపింది. 38 పశువైద్య శాఖలతో అనుబంధంగా ఉన్న సర్జికల్ సెంటర్‌లో జిల్లాకు ఇద్దరు చొప్పున 76 పోస్టులకు నెలకు రూ.56వేల వేతనంతో ఏడాది పనిచేసేలా భర్తీచేయనున్నారు. అర్హులైన వారు www.tanwb. tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, నవంబరు 14వ తేది లోపు వెబ్‌సైట్‌లో పేర్కొన్న చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలని సచివాలయం తెలిపింది.

డిజిటల్ మార్కెంటింగ్‌పై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఆఫ్ ఏఐ అండ్ డిజిటల్ మార్కెటింగ్‌పై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిచయం, చాట్ జీపీటీ, సోషల్ మీడియా, ఈ-మెయిల్ మార్కెటింగ్, వెబ్‌సైట్స్, ఆన్‌లైన్ అడ్వర్‌టైజింగ్ తదితరాలపై ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. 18 ఏళ్లు నిండి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జి ఉన్న యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణలో పాల్గొనే యువతీ, యువకులకు తక్కువ అద్దెకు వేర్వేరు హాస్టల్ కల్పించనున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేయనున్నారు. ఈకాట్టుతాంగళ్ సిడ్కో ఎస్టేట్ ప్రాంగణంలోని సంస్థ కార్యాలయం జరిగే శిక్షణకు హాజరుకావాలనుకొనే అభ్యర్థులు, వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9840114680, 9360221280 నెంబర్లలో సంప్రదించవచ్చు.

పారా మెడికల్ కోర్సులకు గడువు పెంపు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యకళాశాలల్లో ఉన్న పారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు నవంబరు 14వ తేది వరకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో కార్డియో సోనోగ్రాఫిక్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్ సహా పలు పారా మెడికల్ కోర్సుల్లో 5,944 సీట్లున్నాయి. ఈ కోర్సుల్లో అడ్మిషన్లను వైద్య విద్య డైరెక్టరేట్ చేపట్టింది. కానీ, 1,316 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన 4,628 సీట్లు జిల్లా కలెక్టర్ల ద్వారా సంబంధిత కళాశాలల్లో చేరేందుకు అనుమతులిచ్చారు. అడ్మిషన్లకు చివరి తేది ఈ నెల 31గా ప్రకటించగా, 2,000 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఈ సీట్లు భర్తీకి దరఖాస్తు గడువు నవంబరు 14 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

పీరేశ్వర ఆలయంలో వినూత్న వేడుకలు


ఒకరిపై ఒకరు పేడ చల్లుకుంటున్న భక్తులు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఈరోడ్ జిల్లా తాళవాడి కుమ్మిటాపురంలో ఉన్న పీరేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వినూత్న వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ గ్రామంలో 300 ఏళ్ల ప్రాచీనమైన పీరేశ్వరస్వామి ఆలయం ఉంది. ఆ గ్రామ ప్రజలు వ్యవసాయం, పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ గ్రామం అడవి సమీపంలో ఉండడంతో, అడవి జంతువులు పొలాల్లో ప్రవేశించి పంట నాశనం చేస్తుంటాయి. ఈ కారణంగా, జంతువుల నుంచి తమ పంటలు రక్షించాలంటూ కులదైవం పీరేశ్వరస్వామిని వేడుకుంటూ ప్రతి ఏడాది దీపావళి పండుగ ముగిసి మూడవ రోజు గ్రామస్తులు వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, గురువారం గ్రామంలో అన్ని ఇళ్ల నుంచి సేకరించిన ఆవు పేడను ఆలయం వెనుక భాగంలో పోశారు. అనంతరం స్వామి వేషధారణతో ఉన్న భక్తుడిని గ్రామ శివారులోని చెరువు నుంచి గాడిదపై ఆలయం వద్ద ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం, స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆ తరవాఆత చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆలయం వెనుకన ఉన్న పేడను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు కర్ణాటకకు చెందిన భక్తులు కూడా పాల్గొన్నారు. వేడుకల అనంతరం పేడను తమ పొలాలకు తీసుకెళ్లి ఎరువుగా వినియోగించారు. అలా చేయడం వల్ల భూమి సారవంతంగా మారి, మంచి దిగుబడులు అందుతాయని తమ నమ్మకమని గ్రామస్తులు తెలిపారు.

తిరువలంగాడులో చెరకు క్రషింగ్ ప్రారంభం


క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నాజర్ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులో ఉన్న తిరుత్తణి సహకార చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది చెరకు క్రషింగ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం.నాజర్ శుక్రవారం ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా చెరకు పండించిన రైతులు తిరుత్తణి సహకార చక్కెర కర్మాగారానికి చెరుకు సరఫరా చేస్తుంటారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంత్రి నాజర్ క్రషింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ప్రతాప్, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, సహకార చక్కెర కర్మాగారం అధికారులు, చెరకు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం

● టెండర్లు ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.6.3 కోట్లతో సముద్రపు తాబేళ్ల సంరక్షణ పునరావాస కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. గిండి నేషనల్ పార్క్ కాంప్లెక్స్‌లో ఈ కేంద్రం నిర్మించనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి నిర్మాణపనులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

నేటినుంచి ఎంబీబీఎస్ మూడో విడత కౌన్సెలింగ్

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్యకోర్సుల ప్రవేశానికి మూడో విడత కౌన్సెలింగ్ తేదీలను రాష్ట్ర వైద్యవిద్య విద్యార్థుల ఎంపిక బోర్డు ప్రకటించింది. కొత్తగా 200 ఎంబీబీఎస్ సీట్లు చేర్చిన నేపథ్యంలో, ఆ సీట్లకు, ఇప్పటికే ఖాళీ ఉన్న సీట్లకు శనివారం సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో నమోదుచేసి కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చు. కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఈ నెల 26వ తేది మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానుంది. 29వ తేది సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలు ఎంపిక చేసుకోవచ్చు. అర్హత ఆధారంగా ఈ నెల 30వ తేది సీట్లు కేటాయించి, ఆ జాబితా 31వ తేది విడుదల చేయనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు, వెబ్‌సైట్ నుంచి కేటాయింపు ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకుని, నవంబరు 5వ తేదిలోగా కళాశాలలో చేరాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. మొదట విల్లుపురంలోని తక్షశిల వైద్య కళాశాలలో 50 సీట్లు, హోసూరులోని సెయింట్ పీటర్స్ వైద్యకళాశాలలో 100 సీట్లు, నామక్కల్‌లోని వివేకానంద వైద్య కళాశాలలో 50 సీట్లు అని అదనంగా 200 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ అనుమతులు జారీచేసింది.

నేడు నగరంలో 'నలం కాక్కుం స్టాలిన్' వైద్య శిబిరం

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్య శిబిరం జరుగనుంది. అన్ని జిల్లాల్లో 'నలం కాక్కుం స్టాలిన్' పేరుతో ప్రత్యేక వైద్యశిబిరాలను ఆగస్టు 2వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ తేనాంపేట మండలంలో లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా, వలసరవాక్కం మండలం లేమస్ మహోన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు.

టీవీకేకు క్షేత్రస్థాయి నిర్మాణం లేనందునే తొక్కిసలాట : వైగో

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు క్షేత్రస్థాయిలో నిర్మాణం లేనందునే కరూర్‌లో తొక్కిసలాట జరిగిందని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, హీరో విజయ్ రాజకీయాల్లోకి వచ్చారని, ఈ రంగంలోకి ఎవరు వచ్చిన ఆహ్వానించాలన్నారు. అయితే, కరూర్ తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోవడానికి ఆయన అనుభవ లేమే కారణమన్నారు. డీఎంకేలో ఎంజీఆర్ ఉన్న సమయంలో ప్రజలు భారీ సంఖ్యలో హాజరై రెండు వైపులా గుమికూడి ఆయన సభలను చూసేవారన్నారు. ఆ సభలకు విజయ్ సభల కంటే ఎక్కువగా జనం వచ్చేవారన్నారు. అలాంటి సమయాల్లో కొందరు కిందపడిన సంఘటనలున్నాయని, కానీ, ఎవరూ కూడా ప్రాణాలు కోల్పోదని గుర్తు చేశారు.


చేపల వేటకు తూత్తుకుడి జాలర్లు


చేపల వేటకు బయల్దేరిన జాలర్లు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జాలర్లు నాలుగు రోజుల అనంతరం శుక్రవారం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురిసాయి. అదే సయమంలో, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రంలో వాతావరణ అల్లకల్లోలంగా ఉంది. దీంతో ముందస్తు జాగ్రత్తగా జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో, నాలుగు రోజులుగా పడవలను తీరంలోనే లంగరు వేసి ఉంచారు. వాతావరణం అనుకూలించడంతో శుక్రవారం ఉదయం తూత్తుకుడి షిఫింగ్ హార్బర్ నుంచి షిఫ్టు విధానంలో 107 పడవల్లో జాలర్లు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు.

మద్యం అమ్మకాలను పెంచే ఉద్దేశం లేదు

● మంత్రి ఎస్.ముత్తుస్వామి



ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం అమ్మకాలను పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి స్పష్టంచేశారు. ఈరోడ్‌లో శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, టాస్మాక్ సంస్థ ద్వారా రాష్ట్రంలో మద్యం విక్రయాలను పెంచేందుకు ప్రభుత్వం ఎలాంటి అదనపు చర్యలు తీసుకోలేదని, అయినా పండుగ రోజుల్లో మద్యం విక్రయాలు మాత్రం రికార్డు స్థాయిలో ఉంటున్నాయన్నారు. టాస్మాక్ దుకాణాల సంఖ్యను క్రమక్రమంగా తగ్గించే చర్యలు చేపట్టామని, తిరిగిచ్చే ఖాళీ సీసాకు రూ.10 చెల్లిస్తున్నామని, ఆ నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతుందని ఆయన తెలిపారు. టాస్మాక్ చిల్లర దుకాణాల్లో బాటిల్‌కు ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా రూ.10 వసూలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు.

గర్భిణులకు అవగాహన కార్యక్రమం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం గర్భిణులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు అప్రమత్తతతో ఉంటూ వైద్య నిపుణుల సలహాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూరోసర్జన్ రంజిత్ మూర్తి, డాక్టర్ భరణీధరన్, డా.రాజేష్ సహా సీఎంసీ ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

లాయర్‌పై కేసు వ్యవహారం..

విధులు బహిష్కరించి న్యాయవాదులు


నిరసనలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

తిరుత్తణి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని మురుక్కంపట్టు పంచాయతీ ప్రజలు గత సోమవారం ఉదయం నీటిసమస్యపై నిరసన తెలిపిన వ్యవహారంలో అందులో పాల్గొన్న అయ్యప్పన్ అనే న్యాయవాదిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనితో శుక్రవారం ఉదయం న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి జిల్లా సెషన్స్‌కోర్టు ఎదుట నిరసనకు దిగారు. ప్రజల తాగునీటి సమస్యపై నిరసన తెలుపుతున్న న్యాయవాది అయ్యప్పన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వెంటనే ఆతనిని విడుదల చేసి అతనిపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని, పోలీసులు అందరి ముందు క్షమాపనలు చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సకాలంలో చర్యలు తీసుకోకుంటే శనివారం కూడా పెద్దఎత్తున నిరసన తెలుపుతామని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న తిరువళ్లూరు జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా న్యాయవాద సంఘ సభ్యులతో మాట్లాడి తగిన చర్యలు చేపడతామన్న హామీతో వారు నిరసన విరమించారు.

ఇద్దరు మంత్రులున్నా... మదురై జిల్లాలో అభివృద్ధి శూన్యం

● మాజీమంత్రి సెల్లూరు రాజు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మంత్రులున్న మదురై జిల్లాలో అభివృధి శూన్యమని అన్నాడీఎంకే సీనియర్‌నేత, మాజీమంత్రి సెల్లూరు రాజు విమర్శించారు. మదురై జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కామరాజర్ రోడ్డులో జరిగిన పార్టీ జిల్లా నాయకుల సమావేశంలో పాల్గొన్న సెల్లూరు రాజు మాట్లాడుతూ, అన్నాడీఎంకే ఏర్పడి 54యేళ్లు గడిచినా పార్టీలో చేరేందుకు యువత ఉత్సాహంగా ముందుకొస్తున్నారని, 31యేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి 2021 అనంతరం కుంటుపడిందని ఆరోపించారు. మదురై కార్పొరేషన్‌లో అవినీతి కేసులో డీఎంకేకు చెందిన మేయర్ రాజీనామా చేసి రెండు నెలలు గడుస్తున్నా, కొత్త మేయర్‌ను ఎంపిక చేయడంలో అధికార పార్టీ నేతలు చతికలబడ్డారని విమర్శించారు. స్టాలిన్ మంత్రివర్గంలో మదురై జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులుగా ఉన్నారని, వారు ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపిస్తారని, అందువల్లే ఈ జిల్లాలో అభివృద్ధి అంతంతమాత్రానే ఉందని సెల్లూరు రాజు విమర్శించారు.

లంచం తీసుకున్న తహసీల్దార్ అరెస్ట్


లంచం నగదుతో పట్టుబడిన తహసీల్దార్ అన్నాదురై

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టాలో పేరు మార్చిడికి రూ.2 లక్షలు లంచం ఆశించిన తహసీల్దార్ కటకటాలపాలయ్యాడు. తంజావూరు జిల్లా నెంజికోట రోడ్డుకు చెందిన కృష్ణకుమార్ బంధువు గోపికి తిరుచ్చి కె.సాతనూరులో 11,070 చ.అ స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించిన పట్టాలో యజమాని పేరు తిరుచ్చి కార్పొరేషన్ కమిషనర్‌గా తప్పుగా నమోదైంది. పట్టాలో తన పేరు నమోదుచేయాలని తిరుచ్చి రెవెన్యూ అధికారి పీఏగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ అన్నాదురైను గోపి సంప్రదించాడు. పేరు మార్చేందుకు రూ.2 లక్షలు ఇవ్వాలని తహసీల్దార్ కోరాడు. లంచం ఇచ్చేందుకు అంగీకరించని గోపి, తిరుచ్చి జిల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచనలతో, రసాయనాలు పూసిన నోట్లను గోపి గురువారం సాయంత్రం అన్నాదురైకు అందజేస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి పోలీసులు తహసీల్దార్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

నదీ ప్రవాహానికి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు


నదిలో పూలు వేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్ తదితరులు

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని కౌండిన్య నది గత కొన్ని నెలలుగా నీరు లేక ఎండిపోయింది. ఈశాన్య రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో నదిలో నీటి ప్రవాహం అధికమైంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు నదిలో నీటి ప్రవాహానికి ఆహ్వానం పలుకుతూ, పూలు చల్లి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడియాత్తం డీఎంకే అధ్యక్షుడు సౌందరరాజన్, యూనియన్ కార్యదర్శి ప్రదీప్, డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడొద్దని మందలింపు

● ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని తల్లిదండ్రులు మందలించడంతో ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. కడయాంపట్టి కరట్టుకోట ప్రాంతానికి చెందిన తంగరాజ్ కుమార్తె నివేద (17) కడయాంపట్టిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో ప్లస్ టూ చదువుతోంది. దీపావళి పండుగ రోజున నివేద ఎక్కువగా సెల్‌ఫోన్ పట్టుకుని ఉండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నివేద ఇంట్లో ఉన్న మాత్రలు ఒకేసారి 30 వేసుకుని స్పృహతప్పింది. తల్లిదండ్రులు ఆమెను వెంటనే ఓమలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక గురువారం సాయంత్రం నివేద మృతిచెందింది. ఈ ఘటనపై తీవట్టిపట్టి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గిఫ్ట్ ప్యాక్ పేరిట టోకరా..

● వృద్ధురాలికి రూ.47 లక్షల మోసం

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లండన్ నుంచి గిఫ్ట్ ప్యాక్ పంపుతున్నామంటూ మాజీ ప్రభుత్వ ఉద్యోగిని దగ్గర రూ.47 లక్షల కాజేసిన అపరిచిత వ్యక్తుల కోసం సైబర్ క్రైం పోలీసులు గాలిస్తున్నారు. తంజావూరు వైద్య కళాశాల రోడ్డుకు చెందిన 64 ఏళ్ల మాజీ ప్రభుత్వ ఉద్యోగిని సెల్‌ఫోన్‌కు జూలై 8వ తేది ఫోన్ చేసిన ఓ మహిళ తాను ఆ ఉద్యోగి క్లాస్‌మేట్‌నంటూ పరిచయం చేసుకుంది. ఆమె క్లాస్‌మేట్స్ పేర్లు కూడా చెప్పడంతో ఆమెకు నమ్మకం కుదిరింది. తన భర్త చనిపోవడంతో ప్రస్తుతం ఒంటరిగా లండన్‌లో ఉంటున్నట్లు ఆ మహిళ తెలిపింది. అప్పటి నుంచి తరచూ ఇద్దరూ వాట్సాప్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో, లండన్ నుంచి గిఫ్ట్ ప్యాక్ పంపుతున్నట్లు ఆ మహిళ తెలిపింది. కొద్దిరోజుల అనంతరం లండన్ విమానాశ్రయం ఎయిర్‌లైన్ కార్గో ఏజెన్సీ నుంచి మాట్లాడుతున్నామని, లండన్ నుంచి మీకు రూ.40 లక్షల విలువైన గిఫ్ట్ ప్యాక్ పంపుతున్నట్లు, అందుకు ఫీజుగా రూ.1.50 లక్షలు చెల్లించాలని కోరారు. ఈ విషయమై ఆమె లండన్ మహిళను సంప్రదించగా, ప్రస్తుతం ఫీజు చెల్లించండి, తాను ఇండియా వచ్చిన తర్వాత ఆ నగదు ఇస్తానని చెప్పింది. ఈ మాటలు నమ్మిన ఆమె, ఏజెన్సీ చెప్పిన ఖాతాకు డిజిటల్ విధానంలో నగదు బదిలీ చేసింది. అనంతరం ఆ ఏజెన్సీ, పార్శిల్‌లో లండన్ నగదు (పౌండ్లు) వున్నాయని, అందుకు ఫీజు చెల్లించాలని చెప్పడంతో పాటు వివిధ కారణాలు చూపి, ఆ మహిళ నుంచి పలు విడతలుగా రూ.46.91 లక్షలు తీసుకున్నారు. ఎన్ని రోజులైనా పార్శిల్ రాకపోవడంతో బాధిత మహిళ, లండన్ మహిళను, కార్గో ఏజెన్సీ నెంబర్లను సంప్రదించగా, అవి పనిచేయడం లేదని తెలిసింది. ఈ వ్యవహారంపై బాధిత మహిళ ఫిర్యాదుతో తంజావూరు జిల్లా సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

● ఇసుక క్వారీ అల్లర్ల కేసు..

మంత్రి శివశంకర్ సహా 27 మంది విడుదల

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ అల్లర్ల కేసులో మంత్రి శివశంకర్ సహా 27 మందిని విడుదల చేస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కడలూరు జిల్లా నెయ్‌వాసల్, అరియలూరు జిల్లా సెంతురై సన్నాసినల్లూర్ మధ్య వెల్లారు నదిలో ప్రభుత్వ ఇసుక క్వారీ ఉంది. ఈ క్వారీ తమకు సొంతమంటూ నెయ్‌వాసల్, సన్నాసినల్లూర్ ప్రాంత ప్రజల మధ్య సమస్య నెలకొంది. 2015 జనవరి 31న రెండు జిల్లా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సరిహద్దులు ఏర్పాటుచేశారు. ఈ సర్వేను సన్నాసినల్లూర్ ప్రజలు వ్యతిరేకించారు. ఆ సమయంలో కున్నం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత రవాణా శాఖ మంత్రి శివశంకర్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన అల్లర్లకు దారితీయడంతో, ఆందోళనకారుల దాడిలో 9 మంది పోలీసులు గాయపడగా, రెండు ఎక్సకవేటర్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై మంత్రి శివశంకర్ సహా 31 మందిపై ఆవినంగుడి పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు కడలూరు-1వ క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతుండగా, నలుగురు మృతిచెందారు. అనంతరం ఈ కేసు ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారిస్తున్న జిల్లా సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి జస్టిస్ సుభద్రాదేవి... ఈ కేసులో మంత్రి శివశంకర్ సహా 27 మందిపై నేరారోపణ రుజువుకాకపోవడంతో, వారిని విడుదల చేస్తూ గురువారం తీర్పు వెలువరించారు.

విద్యార్థినిని దండించిన హెచ్‌ఎం సస్పెన్షన్

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళిదివాక్కంలో ఐదో తరగతి విద్యార్థినిని చితకబాదిన వ్యవహారంలో హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ ప్రాంతంలోని కార్పొరేషన్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న 10 ఏళ్ల బాలిక, ఈ నెల 9వ తేది పెన్‌లో ఇంకు తరగతి గదిలో కిందపోసినట్లు సమాచారం. ఈ విషయం తెలిసి హెచ్‌ఎం ఇందిరా గాంధీ, బాలికను నేల తుడిచే వస్తువుతో కొట్టడంతో బాలిక చేతులు, కాళ్లు వాచిపోయాయి. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలుపడంతో, వారు మడిపాక్కం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో, బాలిక అస్వస్థతకు గురికావడంతో గిండిలోని ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణ చేపట్టిన జిల్లా విద్యా శాఖ అధికారులు హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ చేశారు.

కుక్కకాటుతో 11 మందికి గాయాలు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో కుక్క కాటుతో 11 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తిరుచెందూర్ కీలనాళకిన్నెర ప్రాంతానికి చెందిన శంకరన్, షర్మిల దంపతులు పెంచుకుంటున్న కుక్క హఠాత్తుగా వారి పదేళ్ల కుమారుడిని కరిచింది. దీంతో ఇంట్లో నుంచి కుక్కను తరిమేందుకు ప్రయత్నించిన 10 మంది కుక్కకాటుకు గురైయ్యారు. గురువారం క్షతగాత్రులను తిరుచెందూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు బజార్ రజతోత్సవాలు


కేక్ కట్‌చేసి నిర్వాహకులకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం రైతు బజార్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం మార్కెట్ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతు బజార్ కమిటీ నిర్వాహకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సెల్వి సుబ్బలక్ష్మి, వ్యవసాయశాఖ కమిటీ జాయింట్ డైరెక్టర్ స్టీఫెన్ జయకుమార్, నగర అధ్యక్షుడు సౌందరరాజన్, కమిటీ నిర్వాహకులు సత్యానందం, పళని, సుధాకరన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కమీషన్ డిమాండ్

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరిధాన్యం కొనుగోలుకు రైతుల నుండి బస్తాకు రూ.40 కమీషన్‌ను డిమాండ్ చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. పెరంబలూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈశాన్య రుతుపవనాల ఆగమనంపై వాతావరణ కేంద్రం నెల రోజుల ముందే హెచ్చరించిందని, అయితే డీఎంకే మోడల్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించిందని తప్పుబట్టారు. డెల్టా జిల్లాల్లో దిగుబడి చేసిన వరిధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడంలో జాప్యం జరిగిందని, అంతేకాకుండా బస్తాకు రూ.40 కమీషన్ డిమాండ్ చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై అధికార పార్టీ నేతలు ఇప్పటివరకు స్పందించలేదన్నారు.

7న ఎండీఎంకే నిర్వాహక కమిటీ సమావేశం

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో ఉన్న ఎండీఎంకే ప్రధాన కార్యాలయంలో వచ్చే నెల 7వ తేదీ పార్టీ నిర్వాహక కమిటీ సమావేశం జరుగనుంది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. డీఎంకే కూటమిలో ఉన్న ఎండీఎంకే అసెంబ్లీ ఎన్నికల పై చర్చించేందుకు వచ్చే నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో అధ్యక్షతన నిర్వాహకుల సమావేశం జరుగుతుందని తెలిపింది.



మృతుల కుటుంబాలకు పరామర్శిస్తున్న సీనియర్ నటి అంబిక

పిడుగుపాటుతో మహిళల మృతి

● బాధిత కుటుంబాలకు నటి అంబిక పరామర్శ

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో పిడుగుపాటుకు మృతిచెందిన వారి కుటుంబాలను సీనియర్ నటి అంబిక పరామర్శించారు. అరియనాచ్చి గ్రామంలో ఈ నెల 16న మొక్కజొన్న పొలంలో పనులు ముగించుకున్న నలుగురు మహిలు పిడుగుపాటుకు గురై మరణించిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారంగా ప్రకటించింది. ఈ క్రమంలో, సీనియర్ నటి అంబిక పిడుగుపాటుకు గురై మృతిచెందిన వారి ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డిసెంబరులో ఇంటర్నేషనల్ తమిళర్ బిజినెస్ కాంక్లేవ్



అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు 'ఇంటర్నేషనల్ తమిళర్ బిజినెస్ కాంక్లేవ్ - 2025' మలేసియా వేదికగా జరుగనుంది. ఈ సదస్సును తమిళర్ వర్తగ సంఘం నిర్వహించనుంది. ఇదే విషయంపై ఆ సంఘం ప్రతినిధులు శుక్రవారం నగరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మలేసియా షా అలమ్‌లోని హోటల్ విందం గార్డెన్-1 సిటీ, మిడ్‌ల్యాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుందన్నారు. ఈ వేడుకలతో పాటు తమిళర్ వర్తగ సంఘం నాలుగో వార్షికోత్సవం కూడా నిర్వహిస్తామని ఇందులో సుమారుగా వెయ్యి మందికిపైగా పారిశ్రామికవేత్తలు, బిజినెస్ పీపుల్, ప్రజలు పాల్గొంటారని, సదస్సు కోఆర్డినేటర్లు అయిన సుందర్, బాలకృష్ణన్ బత్తుమలైలు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2.14 కోట్లు

డివిడెంట్ అందజేసిన రెప్కో బ్యాంక్



మంత్రికి చెక్కు అందజేస్తున్న బ్యాంక్ చైర్మన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన రెప్కో బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి తమిళనాడు ప్రభుత్వ రూ.7.13 కోట్ల వాటా మూలధనంపై 30 శాతం డివిడెంట్ రూ.2.14 కోట్లను అందజేసింది. ఈ మేరకు రెప్కో బ్యాంక్ చైర్మన్ ఇ.సంతానం, ఆ బ్యాంక్ డైరెక్టర్, రెప్కోహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్ సి.తంగరాజు, మేనేజింగ్ డైరెక్టర్ ఓఎం గోకుల్ శుక్రవారం రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసును సచివాలయంలో కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా పునరావాస శాఖ కార్యదర్శి రీతా హరీష్ తక్కర్, అదనపు కార్యదర్శి కె.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.140 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు బ్యాంక్ ప్రకటించింది. ఇది బ్యాంక్ చరిత్రలోనే అత్యధికంగా అభివర్ధించింది. రాష్ట్ర ప్రభుత్వాల్లో తమిళనాడు ప్రభుత్వం అత్యధిక వాటా మూలధనాన్ని కలిగి, ఆ మేరకు అత్యధిక డివిడెండ్ పొందింది.



రెజీనా సినీ కెరీర్‌కు 20 యేళ్లు

● ఇంకా జర్నీ పూర్తికాలేదంటూ ట్వీట్

చెన్నై యువతి రెజీనా కెసాండ్రా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్నారు. 2005లో విడుదలైన 'కండ నాల్ ముదల్' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె... ఆ తర్వాత 'అళగియ అసుర', 'కేడి బిల్లా కిల్లాడి రంగా', 'మానగరం', 'చక్ర', 'కసడ తపర', 'కంజూరింగ్ కన్నప్పన్', 'విడాముయర్చి' వంటి అనేక హిట్ చిత్రాల్లో నటించారు. కోలీవుడ్‌లో అవకాశాలు సన్నగిల్లడంతో ఆమె తెలుగులోకి ఎంట్రీ ఇచ్చి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తన 20 యేళ్ళ సినీ ప్రస్థానంపై ఆమె స్పందిస్తూ, 'అభిమానుల ప్రేమాభిమానాలే ఇంతకాలం ఇండస్ట్రీలో కొనసాగేలా చేశాయి. ఎంతో సంతోషంగా ఉంది. ఈ జర్నీ సుదీర్ఘమైనది. మున్ముందు కొనసాగించే జర్నీ కోసం మరింతగా శ్రమిస్తాను. అభిమానులను అలరించేలా నటిస్తాను' అని పేర్కొన్నారు.

'పాన్ ఇండియా మూవీ' అర్థం మారిపోయింది

● విష్ణు విశాల్



'ఆర్యన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

ఇపుడు 'పాన్ ఇండియా మూవీ' అంటే అర్థం మారిపోయిందని హీరో, నిర్మాత విష్ణు విశాల్ అన్నారు. తాను హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆర్యన్' ఈ నెల 31 న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం నగరంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఇందులో చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. విష్ణు విశాల్ మాట్లాడుతూ, 'ఇపుడు పాన్ ఇండియా మూవీ అంటే అర్థం మారిపోయింది. నిజం చెప్పాలంటే మన నేటివిటీకి సంబంధించిన చిత్రాలే పాన్ ఇండియా సినిమాలు. అలాంటి వాటికి మాత్రమే ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అందుకే తమిళ ప్రేక్షకులను అలరించేలా ఈ మూవీని రూపొందించాం. సాధారణంగా నేను ఎల్లవేళలా కొత్తదనానికి ప్రయత్నిస్తుంటాను. ఇందులోనూ అలాంటి ప్రయోగం చేశాం. దర్శకుడు సెల్వరాఘవన్ పాత్ర మూవీకి హైలెట్. నా కుమారుడు పేరు ఆర్యన్.. అతని పేరుమీద ఈ చిత్రాన్ని తీసినందుకు సంతోషంగా ఉంది. ఈ మూవీ మరో 'రాచ్చసన్' మూవీ అవుతుంది. 'ఆర్యన్'తో ప్రేక్షకులను భిన్నమైన అనుభూతి అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఈ సినిమా కోసం దర్శకుడు ప్రవీణ్ ఐదేళ్ళ పాటు శ్రమించారు. ఈ సినిమా హిందీ వెర్షన్‌లో హీరో అమీర్ ఖాన్ నటించాల్సి ఉంది. కానీ అది సాధ్యపడలేదు. దీంతో తమిళంలో నేను తీశాను. హీరో ధనుష్ ఉన్నతస్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారణం అతని కృషి, పట్టుదల. ఆయన ఒక గొప్ప నటుడు' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ కె మాట్లాడుతూ, 'ఈ సినిమా కథ అందించిన దర్శకుడు మను ఆనంద్‌కు ధన్యవాదాలు. పూర్తిగా అర్థం చేసుకునే నటుడిని పొందడం ఏ దర్శకుడికైనా ఒక వరం. విష్ణు విశాల్ నిర్మాతగా, నటుడిగా రెండు పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కాగా, విష్ణు విశాల్ స్టూడియోస్ పతాకంపై సుప్రా, ఆర్యన్ రమేష్ సమర్పణలో ప్రవీణ్ కె దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది.

చిత్రజ్యోతి

కవిన్ - ఆండ్రియా జంటగా 'మాస్క్'

● నవంబరు 21న విడుదల

యువ హీరో కవిన్ - ఆండ్రియా జెర్మయ్య, రుహానీ శర్మ జంటగా నటించిన 'మాస్క్' చిత్రాన్ని నవంబరు 21న విడుదల చేయనున్నట్టు మేకర్స్ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. ది షో మస్ట్ గో ఆన్, మద్రాస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి కొత్త డైరెక్టర్ వికర్ణన్ అశోక్ దర్శకత్వం వహించారు. దీపావళి సందర్భంగా ఈ మూవీ నుంచి కొత్త లుక్ రిలీజ్ చేసిన మేకర్స్ శుక్రవారం రిలీజ్ తేదీ వెల్లడించారు. మూవీ ఓటీటీ హక్కులను జీ5 సొంతం చేసుకోగా, ఆడియో రైట్స్‌ను టి సిరీస్ దక్కించుకుంది. ఇతర పాత్రల్లో చార్లీ, రమేష్ తిలక్, కాలేజ్ వినో, అర్చన చందోక్ నటించారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ 'ఎమోషన్, కామెడీ, సస్పెన్స్ మిళితం చేస్తూ రూపొందించిన డార్క్ కామెడీ మూవీ. ఆహ్లాదభరితంగా స్క్రీన్‌ప్లే సాగిపోతోంది. ఆడియన్స్‌కు విభిన్నమైన సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు నవంబరు 21వ తేదీన వస్తున్నాం' అని పేర్కొన్నారు.



'మాస్క్'లో కవిన్

దర్శకుడిగా కెన్ కరుణాస్ చిత్రం ప్రారంభం



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

● హాజరైన సినీ ప్రముఖులు

బాల నటుడుగా గుర్తింపు పొందిన సీనియర్ నటుడు, రాజకీయ నేత కరుణాస్ కుమారుడు కెన్ కరుణాస్ దర్శకత్వం వహించే తొలి చిత్రం ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. గురువారం నగరంలో జరిగిన ఈ వేడుకలో చిత్ర పరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని, చిత్ర బృందానికి విషెస్ చెప్పారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో కెన్ కరుణాస్, అనిష్మా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాంషి యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పాఠశాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందించనున్నారు. పర్వత ఎంటర్‌టైన్మెంట్, స్ట్రీట్ బాయ్ స్టూడియోస్ పతాకంపై కరుప్పయ్య సి.రామ్, కాళి రాజ్‌కుమార్, సులోచన కుమార్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నగరంలో జరిగిన చిత్ర ప్రారంభోత్సవంలో హీరోలు కార్తి, విశాల్, దర్శకులు వెట్రిమారన్, ఆర్జే బాలాజీ, నిర్మాతలు కలైపులి ఎస్.థాను, డాక్టర్ ఐసరి కె.గణేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ లయాన్వితం... శ్రేయాన్వి గానం

తరుణి





కుటుంబ సభ్యులతో శ్రేయాన్వి



ఎస్పీ చరణ్‌తో

● వర్ధమాన గాయని శ్రేయాన్వి నూకల

వేళచ్చేరి-ఆంధ్రజ్యోతి

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు కొందరు చిన్నారులు బాల్యంనుంచే ప్రతిభ కనబరుస్తుంటారు. కృషి, దృఢమైన సంకల్పశక్తి కావాలి. అన్నింటికీ మించి ప్రోత్సాహం, ప్రేరణ లభించాలి అప్పుడే ఆ కళ మొగ్గతొడిగి పుష్పిస్తుంది. అలాంటి ప్రోత్సాహం తల్లిదండ్రుల నుంచి లభించడంతో తన పాటల పరిమళాన్ని చిత్ర రంగానికి వ్యాపింపజేసింది చిన్నారి శ్రేయాన్వి. "పిట్టకొంచెం కూతఘనం" అన్నట్టుగా ఆడుకునే ప్రాయంలో పాటలపై మక్కువ పెంచుకుని, సంగీత సాధన చేస్తూనే, షోలకు హాజరవుతూ, తన చదువు కూడా కొనసాగిస్తున్నది. 'చిన్నారి పొన్నారి చిరుత ప్రాయం'లోనే సినిమా నేపథ్యగానంలో ఆరంగేట్రం చేసిన శ్రేయాన్వి పాటల ప్రయాణంలోని పదనిసలు తెలుసుకుందాం.



గాయని శైలజతో

శ్రేయాన్వి జన్మించింది తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో. అయితే పెరుగుతున్నదంతా చెన్నైలోనే. తల్లి వినోదిత. తండ్రి గిరిబాబు. శ్రేయాన్వి సోదరి పుర్విత 10వ తరగతి చదువుతోంది. తల్లి కొన్నాళ్లు ఆకాశవాణి చెన్నై కేంద్రంలో క్యాజువల్ అనౌన్సర్‌గా పనిచేశారు. ఇంట్లోనే స్కూలు విద్యార్థులకు హిందీ, లెక్కలు కోచింగ్ ఇస్తుంటారు. తండ్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. శ్రేయాన్వి అడయార్‌లోని హిందూ సీనియర్ సెకండరీ స్కూలులో 7వ తరగతి చదువుతున్నది.

పాటలపై ఆసక్తి... ప్రభవించిందిలా...

ఉయ్యాలో ఉండగానే తల్లిపాడే జోలపాటలను ఆసక్తిగా ఆలకించే శ్రేయాన్వి. మూడేళ్ల వయసులోనే బాలగేయాలు, శృతి లయ తప్పకుండా పాడుతుండేది. నాలుగేళ్ల ప్రాయంలో భగవద్గీత శ్లోకాలు, చిన్నచిన్న పాటలు సులువుగా నేర్చుకుని గానం చేసేది. పాటలపై శ్రేయాన్వి ఇష్టాన్ని గమనించిన తల్లిదండ్రులు సీతారాజన్ వద్ద కర్ణాటక సంగీతంలో శిక్షణ ఇప్పించారు. ఆమె వద్ద సంగీతాభ్యాసం చేస్తూనే శ్రేయాన్వి పలు పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకుంది. పాఠశాలలో పాటల పోటీలో బహుమతులన్నీ శ్రేయాన్వినే వరించేవి. ప్రస్తుతం ప్రీతి సేతురామన్ వద్ద సంగీతాభ్యాసం చేస్తూ, ఫిల్మ్ మ్యూజిక్‌లో పీటీ.గాయత్రి వద్ద శిక్షణ తీసుకుంటున్నది.

ఇతర ఆసక్తులు... : శ్రేయాన్వికి నృత్యం అంటే ఇష్టం. నేర్చుకోకపోయినా పాటలకు తగినట్లుగా డాన్స్ చేస్తుంది. కీబోర్డు వాయిస్తుంది. 'కజూ' ఫ్లూట్ యూ ట్యూబ్‌లో చూసి నేర్చుకుని వాయిస్తుంది. పాటలకు స్వర రచన చేయగల సామర్థ్యం శ్రేయాన్వికి ఉంది. తండ్రి రాసిన పాటలకు తానే ట్యూన్ కట్టి పాడుతుంది.



టీవీషోలో బహుమతి అందుకుంటున్న దృశ్యం

"పెద్దయ్యాక సంగీతంలోనే ముందుకు వెళ్లాలని, నేపథ్యగాయని కావాలని, పాటలకు స్వరకల్పన చేయాలనే కోరిక ఉన్నది. ప్రతినిత్యం నేను సంగీతసాధన క్రమం తప్పకుండా చేస్తాను. మా స్కూలు తరుపున శాస్త్రీయ సంగీత కచేరీల్లో పాలుపంచుకుంటాను. స్కూలు తరుపున 'భక్తిస్వర' భజన పోటీల్లో 'సుప్రభాతస్వర' పేరుతో శాస్త్రీయ బృంద గానకచేరీలో కూడా తరచూ పాల్గొంటాను. నేపథ్యగానంలో చిత్ర, శ్రేయాఘోషల్ నాకు నచ్చిన గాయనీమణులు. నేను కూడా వారంత గొప్పగా పాడాలని, జీవితంలో పాటల శిఖరాన్ని అధిరోహించాలని నా ఆశయం." అంటూ 'ఆంధ్రజ్యోతి'తో తన మనోభావాలు పంచుకుంది శ్రేయాన్వి.

అందుకున్న బహుమతులు...



- శ్రేయాన్వి ఆర్టియమ్ అకాడమీవారు నిర్వహించిన 'ఆర్టియమ్ సూపర్‌స్టార్' పోటీలో ప్రథమ బహుమతి సాధించింది.
- 'పాపనాశమ్ శివమ్ శాస్త్రీయ సంగీత పోటీ'లో ప్రథమ బహుమతి అందుకుంది.
- 'కళాసౌరభ' అంతర్జాతీయ సంగీత, నృత్య పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
- బెంగళూరులో ఇస్కాన్‌వారి నిర్వహణలో జరిగిన శాస్త్రీయ సంగీత పోటీల్లో మూడో బహుమతి పొందింది.
- 'జీ-తమిళ్' సరిగమప లిటిల్ ఛాంప్స్ సీజన్-4 రియాలిటీషోలో సెమీఫైనల్స్ వరకు వచ్చింది శ్రేయాన్వి.
- ప్రస్తుతం 'జీ-తెలుగు' సరిగమప షోలో పాల్గొంటోంది.
- ఇక ఆమె ప్రతిభను గమనించి సినిమా సంగీత దర్శకులు ఆమెకు సినిమాల్లో పాడే అవకాశం ఇచ్చారు.

నేపథ్యగానం చేసిన చిత్రాలు...

- ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకత్వంలో 'థగ్ లైఫ్'చిత్రంలో శ్రేయాన్వి గానం చేసింది.
- డి.ఇమ్మాన్ సంగీత దర్శకత్వంలో 'టెంపుల్ రన్' చిత్రంలో గానం చేసే అవకాశం శ్రేయాన్వి పొందింది.

మరో చిత్రంలో కూడా శ్రేయాన్వి పాడింది. అది ఇంకా విడుదల కాలేదు. శ్రేయాన్వి ఇంకా కొన్ని ఆల్బమ్స్ కూడా చేసింది. మనోరమ మ్యూజిక్‌లో ఆల్బమ్‌లో పాటలు పాడింది. ఎన్నో భక్తిగీతాలు కూడా గానం చేసింది. శ్రేయాన్వి పలు సంగీత ప్రదర్శనల్లో పాటలు పాడి ప్రశంసలందుకున్నది. ఇటీవల ఒక ప్రదర్శనలో పి.సుశీల ముందు ఎస్.పి.చరణ్‌తో కలిసి పాడి ఆమె మెప్పుపొందింది. 'అడియన్ నాదస్వరమ్' నిర్వహించిన 'తిరుక్కురల్ ప్రాజెక్ట్'లో కూడా శ్రేయాన్వి పాడడం విశేషం.



చెంబగతోపు కొండల్లో జాలువారుతున్న వర్షపు నీరు

కనువిందు చేస్తున్న జలపాతాలు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా, పశ్చిమ కనుమలల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ ఆనుకొని ఉన్న కొండ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో నీటి ప్రవాహం అధికం గా ఉంది. అదే సమయంలో, చెంబగతోపు కొండపై కొత్త జలపాతాలు ఏర్పడ్డాయి. ఎత్తైన కొండల నుంచి నీరు జాలువారుతున్న దృశ్యాలు అబ్బురపరుస్తున్నాయి.

ఐఎస్‌వీటీఈసీ-2025 ప్రారంభం



సదస్సులో పాల్గొన్న వైద్యులు - లయోలా కాలేజీ ప్రతినిధులు

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆప్టోమెట్రీ, లయోలా ఐసీఏఎం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా దేశంలోనే తొలిసారి ఇంజనీర్ అండ్ ఐ కేర్ నిపుణుల 'ఐఎస్‌వీటీఈసీ 2025' సదస్సు శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. నేత్ర సంరక్షణ కోసం ఇంటెలిజెంట్ సిస్టం అండ్ విజన్ టెక్నాలజీపై ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో ఆర్థా సిస్టమ్ ఎల్ఎల్‌సీ వైస్ ప్రెసిడెంట్ విశ్వక్ అవనన్, తమిళనాడు ఆప్తమాలజీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుజాత మోహన్, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ క్లినికల్ బోర్డు చైర్‌పర్సన్ డాక్టర్ సౌందరి, డీఏఐవో డీన్ డాక్టర్ కర్పగం, డీఏఐవో ప్రొఫెసర్ మహేశ్వర, ప్రొఫెసర్ హంజా ఖురేషీ, డాక్టర్ ఆంటోనీ రాబిన్‌సన్ ఎస్‌జే తదితరులు పాల్గొన్నారు. శనివారంతో ముగియనున్న ఈ సదస్సులో విర్చువల్ రియాలిటీ విజయ్ థెరపీ అండ్ డయాగ్నోస్టిక్స్, ఎంఏటీఎల్ఏబీ అప్లికేషన్స్, పోర్టబుల్ ఓసీటీ డివైసెస్, ఏఐ అసిస్టెంట్ రెటినల్ ఇమేజింగ్, ఏఐ డయాగ్నోస్టిక్ అండ్ ట్రీట్మెంట్ ప్లానింగ్ తదితర అంశాలపై వైద్య నిపుణులు, ఇంజనీర్లు చర్చించారు.

వనదుర్గా ఆలయంలో స్కందషష్టి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో సుబ్రమణ్యస్వామి

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా ఇరైవన్‌కాడులోని వనదుర్గా పీఠంలో స్కంద షష్టి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం వల్లీ, సమేత సుబ్రమణ్యస్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం మహిళలు 108 క్షీరకలశాలతో ఊరేగింపుగా ఆలయం వదరకు వచ్చారు.



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న విద్యావేత్తలు

జైన్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏఎం జైన్ కళాశాలలో శుక్రవారం 'తమిళ విద్య, శాస్త్రీయ అభివృద్ధి' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. తమిళ అభివృద్ధి బోర్డు, మద్రాస్ విశ్వవిద్యాలయం, సంధ్య పబ్లికేషన్స్ సహకారంతో జైన్ కళాశాల ఈ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహించనుంది. ప్రముఖ గేయ రచయిత, కవి కలైమామణి వైరముత్తు ప్రారంభించిన ఈ సదస్సులో 25 మందికి పైగా ప్రముఖ తమిళ పండితులు ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు.

తిరుత్తణికి పోటెత్తిన భక్తులు



పుష్పాలంకారంలో వల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

తిరుత్తణి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో గత బుధవారం ప్రారంభమైన స్కందషష్ఠి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం స్వామివారిని పుష్పాలతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, బంగారు కవచాన్ని ధరింపజేశారు. ఇదిలా ఉండగా, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు నిర్దేశిత సమయాల్లో దర్శనానికి నిషేధం విధించారు. భక్తులకు వసతులు కల్పించే ఏర్పాట్లలో ఆలయ జాయింట్ కమిషనర్ కె.రమణి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీధరన్ పాల్గొన్నారు.




జస్టిస్ సునీల్ చౌదరి | రఘురామకృష్ణమరాజు | సావిత్రి ఠాకూర్ | విజయభారతి సాయని | అరవింద్ సింగ్ | జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి | మనోజ్ శశిధర్ | అశ్విని

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, కేంద్ర మహిళా శిశు శాఖ మంత్రి సావిత్రి ఠాకూర్, కేంద్ర జల శక్తి డైరెక్టర్ హరి నారాయణన్,జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని,గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ రామ్మోహన్,ఇండియన్ ఆయిల్ చైర్మన్ అరవింద్ సింగ్, సీబీఐ డైరెక్టర్ మనోజ్ శశిధర్, తెలంగాణ లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, నటి అశ్విని ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిదిషెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.33 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 60,896

తలనీలాలు సమర్పించినవారు: 23,077



పట్టుబడిన నాగుపాము

అమ్మో.. 9 అడుగుల నాగుపాము

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలిబాటలోని ఎస్ఎస్ టెంపుల్ వద్ద సుమారు తొమ్మిది అడుగుల పొడవైన నాగుపాము శుక్రవారం ఓ దుకాణంలోకి ప్రవేశించింది. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 24 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 24 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 2.40 లక్షల రూపయాలను జరిమానాగా విధించారు.

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాదాయం రూ. 50వేల కోట్లు

● తిరుపతి కేంద్రంగా భారీ అవినీతి ● ప్రజలు చైతన్యం కావాలి ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు పిలుపు

తిరుపతి(విద్య/ఆటోనగర్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కేంద్రంగా ఏపీ ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి జరుగుతోంది. ఏటా ఇక్కడి అక్రమాదాయం రూ.50 వేల కోట్లు' అని ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ రంగంలో అవినీతిపై సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమలోని 11 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు రూ.1200 కోట్లతో అలైడ్ ఎక్విప్‌మెంట్ డబ్బు చెల్లించారు. ఎక్కడా ఒక మీటరు కూడా అమర్చలేదు. ఇతర రాష్ట్రాల్లో మీటరుకు రూ.6-7 వేలు చెల్లిస్తే, మన రాష్ట్రంలో రూ.33 వేల వంతున ఇచ్చారు. ఇక, ఆర్‌డీఎస్ఎస్ కింద 26 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఆర్డరు చేస్తే సరఫరా అయింది ఆరు వేలే. మిగిలిన 20 వేల ట్రాన్స్‌ఫార్మర్లు రెండున్నరేళ్లుగా షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ గోడౌన్లలోనే ఉన్నట్టు రికార్డులు చూపిస్తున్నాయి. 2018 టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ పరికరాల కొనుగోలుకు జరిగిన టెండర్-65 ద్వారా 7 కంపెనీలు అర్హత సాధించాయి.వాటిలో తోషిబా,షిరిడీసాయి ప్రధానంగా ఉన్నాయి. 2023లో వైసీపీ ప్రభుత్వంలో టెండర్-34 ద్వారా 8 కంపెనీలు బిడ్లు వేస్తే కేవలం షిరిడీసాయి, తోషిబా మాత్రమే అర్హత సాధించడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోకూడా ఈరెండు కంపెనీలకే కాంట్రాక్టులు ఇస్తున్నారు. అందులోనూ షిరిడీసాయి కంపెనీకే 80-95 శాతం ఉంది. జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దోపిడీని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. విద్యుత్ మాఫియాను అడ్డుకునే శక్తి ఈ ప్రభుత్వానికి ఉందా లేదా? ఇలా రూ.వేల కోట్ల అవినీతితో బిల్లుల పేరిట ప్రజల నడ్డి విరుస్తున్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించాలని, పోరాడాలి' అని ఏబీవీ పిలుపునిచ్చారు. అంతకుముందు సెంటర్ ఫర్ లిబర్టీ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తి ఇదే విషయాలను వాటికి సంబంధించిన రికార్డులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యుత్ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడేందుకు ఎలా ముందుకు వెళ్లాలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యుత్తు సంస్థల్లో అవినీతి నిగ్గు తేల్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండు చేశారు. ఇది లిక్కర్ స్కాం కంటే పెద్దదని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందారపు మురళి పేర్కొన్నారు. ఈ అవినీతిపై ప్రజాక్షేత్రంలో చర్చ జరగాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ సూచించారు. అవినీతికి బలవుతున్నది దళితులు, బహుజనులేనని ఆర్పీఐ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. చార్జీలపెంపు, అవినీతిపై అవగాహన పెరగాలని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేత కె.మోహన్ కుమార్ రాజు అన్నారు. ఈ తరహా అవినీతిని అరికట్టడానికి ప్రజా ఉద్యమం రావాలని బహుజన సమాజ్‌వాది పార్టీ నేత పేరం సత్యం అభిప్రాయపడ్డారు. విద్యుత్ సంస్థలో అవినీతిపై లోతుగా విచారణ జరగాలని విశ్రాంత ఎస్ఈ దేవేంద్రరెడ్డి అన్నారు. పాలకుల వల్లే అవినీతి పెరుగుతోందని లోక్‌సత్తా పార్టీ నేత రామారావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలతో పాటు లిబర్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అక్కినేని భవానీప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏబీ వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధులు, నేతలు

చర్చంతా 'గ్రేటర్ తిరుపతి'పైనే

● సీఎం చంద్రబాబు గొప్ప ఆలోచనతో ప్రతిపాదన చేశారన్న ఆరణి ● ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ సెనెట్ హాలులో శుక్రవారం తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన చర్చంతా గ్రేటర్ తిరుపతి పైనే జరిగింది. మొత్తం 108 అంశాలను కౌన్సిల్‌లో అజెండాగా ఉంచినట్టు మేయర్ శిరీష ప్రకటించారు. ఇందులో 100వ అంశంగా గ్రేటర్ తిరుపతి తీర్మానం ఉన్నట్టు తెలిపారు. గ్రేటర్ తిరుపతి తీర్మానాన్ని ఒకటిగా ప్రవేశపెట్టాలని కార్పొరేటర్లు పట్టుబట్టారు. కాగా, ప్రస్తుతం యథాతదంగా తిరుపతి ఉంటే ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా ఉన్నాయని మేయర్ శిరీష అన్నారు. టీటీడీ సత్రాలు, బస్టాండు, రైల్వే స్టేషన్ అన్నీ ఒకే చోట ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్లు విస్తరించాలంటే కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మెట్రో పాలిటన్ సిటీగా తిరుపతి మారితే అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు గొప్ప ఆలోచనతో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన చేశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గ్రేటర్ తిరుపతి ఏర్పాటులో భాగంగా సమీప నియోజకవర్గాలు, మండల, గ్రామ పంచాయతీలకు సంబంధించి కొన్ని రోజులు చర్చించి నిర్ణయం తీసుకుందామని కోరారు. తనతో పాటు గ్రేటర్ తిరుపతి ఏర్పాటు పట్ల ఎవరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గ్రేటర్ తిరుపతిలో భాగంగా నగర విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ గురుమూర్తి కోరారు. తిరుపతికి అధిక నిధులు రాబట్టేందుకు ప్రయత్నం జరగాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ తిరుపతి ఆలోచన చేయలేదని, ప్రస్తుతం ఈ దిశగా ఆలోచించిన సీఎం చంద్రబాబుకు కౌన్సిల్ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చెప్పారు. కాగా, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మిగతా 107 ప్రతిపాదనలపై చర్చించకుండానే ఆమోదించారు. తుడా వీసీగా, జేసీగా అదనపు బాధ్యతలు స్వీకరించినందుకు కమిషనరు మౌర్యను కౌన్సిల్ అభినందించింది. సమావేశానికి ముందు కార్పొరేటర్ అన్నా సంధ్యా భర్త, కుమారై మృతి పట్ల కౌన్సిల్ సంతాపాన్ని వ్యక్తం చేసింది.



తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ మీట్‌లో కార్పొరేటర్ గణేష్‌ను నెట్టివేసిన ఎస్‌కే బాబు అనుచరుడు

ఘటనపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఘటనపై కార్పొరేటర్ ఎస్‌కేబాబు అన్న కుమారుడు మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ అధికారి సేతుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కౌన్సిల్ మీట్‌లో ఘర్షణ

గ్రేటర్ తిరుపతి తీర్మానంపై చర్చ సాగుతున్న సమయంలో ఇద్దరు కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. జనసేన కార్పొరేటర్ ఎస్‌కే బాబు చర్చలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న సమయంలో.. వైసీపీ కార్పొరేటర్ గణేష్ జోక్యం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన తీసుకురాలేదనీ, మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎస్‌కే బాబు స్పష్టంచేశారు. గ్రేటర్ తిరుపతి జరిగితే భూ వ్యాపారం చేద్దామనా అంటూ ఆయన్ను గణేష్ హేళనగా మాట్లాడారు. దీంతో ఎస్‌కే బాబు కోపోద్రిక్తులయ్యారు. ఇదే సమయంలో వైసీపీ కార్పొరేటర్ గణేష్ ఆవేశంగా మాట్లాడటంతో, ఎస్కే బాబు సోదరుడి కుమారుడు రంగ ప్రవేశం చేసి గణేష్‌పై చేయి చేసుకున్నారు.కూటమి కార్పొరేటర్లు అతడిని దండించి వెలుపలకు పంపారు.తనకు న్యాయం చేయాలంటూ గణేష్ అక్కడే బైఠాయించారు. దీంతో ఎస్‌కే ఆయనకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంలో క్రిమినల్ చర్యలకు తాను, తన అనుచరుడు సిద్ధమని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'స్కిట్' తరగతులపై గందరగోళం

● కలికిరి కళాశాలకు విద్యార్థులను పంపాలంటూ జేఎన్‌టీయూ నిర్ణయం

● పిల్లల భవిష్యత్తుతో చెలగాటం తగదంటూ తల్లిదండ్రుల నిరసన



స్కిట్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల ఆరంభంపై మళ్లీ గందరగోళ పరిస్థితి నెలకొంది. అడ్మిషన్లు తక్కువగా ఉండటంతో తొలి ఏడాది విద్యార్థులకు కలికిరిలో తరగతులు నిర్వహిస్తామని జేఎన్‌టీయూ నిర్వాహకులు ప్రకటించడంపై వ్యతిరేకత వ్యక్తమైంది. శ్రీకాళహస్తిలో అడ్మిషన్ తీసుకున్న తమ పిల్లలను రెండు నెలలు ఆలస్యంగా ఇతర ప్రాంతానికి తరలించాలని సూచించడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కళాశాల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరం స్కిట్ పునఃప్రారంభమయ్యాక 43 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాలను ముక్కంటి ఆలయం నుంచి జేఎన్‌టీయూకు అధికారికంగా లీజు ప్రాతిపదికన అప్పగింతకు జీవో మూడు రోజుల క్రితం వెలువడింది. తొలి ఏడాది విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో కలికిరి కళాశాలలో తరగతులు నిర్వహించేలా చూస్తామని శుక్రవారం జేఎన్‌టీయూ ప్రతినిధి వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ సమయంలో ఎన్నో కళాశాలల్లో అవకాశాలు ఉన్నప్పటికీ స్థానికంగా తమ పిల్లలను చదివించుకోవచ్చన్న ఉద్దేశంతో అడ్మిషన్లు పొందామన్నారు. ఇపుడు సమీపంలో ఎక్కడా అవకాశం లభించదని ఆవేదన వ్యక్తం చేశారు.హోంసిక్‌తో బాధపడే పిల్లలు కలికిరికి ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. రెండు నెలలు ఆలస్యం కావడంతో ఇప్పటికే తొలి ఏడాది విద్యలో వెనుకబడ్డారని వాపోయారు. శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహించేలా మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే సుధీర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● శ్రీసిటీలో నిట్టన్ ఇండియా

అదనపు ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన నిట్టన్ వాల్వ్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ నిట్టన్ ఇండియా టెక్ (ఎన్ఐటీ) పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. హ్యుందాయ్, హోండా, టయోటా, అశోక్ లేలాండ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా, హెచ్ఎంఎస్ఐ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలకు ఇంజిన్ వాల్వ్‌లు సరఫరా చేస్తున్న నిట్టన్ ఇండియా ఈ అదనపు ప్లాంట్ నిర్మాణంతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12 మిలియన్ల నుంచి 24 మిలియన్లకు పెంచింది. ఈ సందర్భంగా నిట్టన్ ఇండియా టెక్ ఎండీ యంగ్ ఓకో మాట్లాడుతూ... 2018 అక్టోబరులో ప్రారంభమైన తమ ప్రయాణాన్ని, లక్ష్యాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సుందర్ మాట్లాడుతూ... నిట్టన్ నాణ్యమైన ఉత్పత్తులు తమ సంస్థ విజయంలో కీలక భాగస్వామిగా మారాయన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. 2014లో శ్రీసిటీలో ప్రారంభమైన నిట్టల్ కంపెనీ నాణ్యతా ప్రమాణాలకు పెద్ద పీట వేస్తూ బలమైన ముద్రను చాటుకుందని తెలిపారు. నూతన ప్లాంట్ సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. దీంతో సంస్థ పెట్టుబడి రూ.257 కోట్లకు.. ఉద్యోగుల సంఖ్య 270 నుంచి 370కు పెరిగింది. ఈ కార్యక్రమంలో నిట్టన్ సంస్థ ప్రతినిధులు టెరుఅకి అండో, యుమికి షిండో, చో సియంగ్ హ్వ్యాన్, రోయూన్ హో తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులు ప్రారంభిస్తున్న నిట్టన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ లీ తైహ్వాన్

ముక్కంటి ధర్మకర్తలమండలిలో నలుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాకిచర్ల గురప్పశెట్టి

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి సభ్యుడిగా వాకిచర్ల గురప్పశెట్టి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ధర్మకర్తలమండలి సభ్యుడిగా గురప్పశెట్టి బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆయనతో పాటు గాదిపాకుల గోపి, లక్ష్మమ్మ, విశాలాక్షి కూడా సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆలయాధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ సస్పెన్షన్

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై విచారణకు ఆదేశం

రేణిగుంట అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల జరిగిన పరిణామాలపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ తిరుమలేశ్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి మధ్య జరిగిన వివాదాల నేపథ్యంలో ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అలాగే ఇటీవల డాక్యుమెంట్ రైటర్లు, అటెండర్ మధ్య వాగ్వాదం జరిగింది. విధుల్లో ఉండగా మీడియాతో మాట్లాడటం, సబ్‌రిజిస్ట్రార్‌పై అవినీతి ఆరోపణలు చేయడంపై అనంతపురం రిజిస్ట్రార్ నివేదిక మేరకు అటెండర్ తిరుమలేశ్‌ను సస్పెండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ రాంకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రేమించకుంటే కుటుంబాన్ని చంపేస్తా..

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను...నువ్వు నన్ను ప్రేమించకుంటే మీ కుటుంబాన్ని చంపేస్తా' అని బాలికను వేధించిన యువకుడిని తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా చెన్నంపల్లి గ్రామానికి చెందిన కోలా దిలీప్‌కుమార్ తిరుపతిలోని ఒక అపార్టుమెంటులో కాపురముంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను ఆరు నెలలుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. వెంటపడి బెదిరిస్తున్నాడు. గురువారం రాత్రి బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఆమె చేయి పట్టుకుని ప్రేమించకపోతే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లి, అన్న వచ్చి అడ్డుకున్నారు. వారినీ బెదిరించాడు. చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం కోలా దిలీప్‌కుమార్‌ను ఆర్సీ పురం జంక్షన్ వద్ద అరెస్టు చేశారు.

44 మంది సచివాలయ ఉద్యోగులకు.. షోకాజ్ నోటీసులు

● పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసిన ఫలితం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేసిన 44 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే పది గంటల్లోపు ఒకరికి కూడా ఇవ్వకపోవడంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు.. జిల్లాలోని శ్రీకాళహస్తి, గూడూరు, తిరుపతి, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, వెంకటగిరి, డక్కిలి, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, వడమాలపేట, పాకాల, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, పుత్తూరు ప్రాంతాలకు చెందిన 44మంది సచివాలయ ఉద్యోగులకు మండలాధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు.